సాక్షి నల్లగొండ

సోమవారం, 7, ఆగస్టు, 2023



శాస్త్రీయ దృక్పథంతోనే..

శాస్త్రీయ దృక్పథం ఉన్న చోటే ప్రజలు సమాన త్వంతో జీవిస్తారని సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. - 10లో



అణగారిన వర్గాల చెంతకే..

అణగారిన వర్గాల చెంతకే సాహిత్యం వస్తుందని సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. - 10లో




యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో రద్దీ నెలకొంది. - 10లో

న్యూస్‌రీల్

సాగర్ ఎడమ కాల్వ కట్టపై భారీ రంధ్రం



సాగర్ ఎడమ కాల్వపై పడిన భారీ రంధ్రం

త్రిపురారం : సాగర్ ఎడమకాల్వ కట్టపై త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి రిజర్వాయర్ సమీపంలో డెయిరీ ఫాం తూము వద్ద భారీ రంధ్రం పడింది. తూముకు సమీపంలో రంధ్రం పడడంతో కట్ట తెగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పాలేరుకు ఎడమకాల్వ నుంచి నీటిని వదిలిన సమయంలో ఈ రంధ్రం పడిందని స్థానిక రైతులు అంటున్నారు. అయితే ఈ రంధ్రం పడిన ప్రదేశంలో కాల్వలో నీరు కమ్ముకుని ఉంటుంది. కాల్వకు నీటిని వదిలితే కట్ట తెగే ప్రమాదం ఉంటుంది. ఇక్కడ కట్ట తెగితే త్రిపురారం, మిర్యాలగూడ, దామరచర్ల మండలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కట్ట పైనుంచి రాకపోకలు సాగించేవారు అందులో పడే ప్రమాదం ఉండడంతో రైతులు ఆ రంధ్రం చుట్టూ కంప వేశారు. ఎన్ఎస్పీ అధికారులు స్పందించి రంధ్రం పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

కార్మిక చట్టాల సంస్కరణలపై ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

మిర్యాలగూడ : కార్మిక చట్టాల సంస్కరణలపై మరో ఉద్యమం చేపడ్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయి గ్రామ పంచాయతీ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు సంస్కరణల పేరుతో కొత్త చట్టాలు తీసుకొస్తున్నారని మండిపడ్డారు. నిత్యావసర ధరలు పెరుగుదలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మిక వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రామ్మూర్తి, నాయకులు లక్ష్మీనారాయణ, దయానంద్, రొండి శ్రీనివాస్, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య, బుచ్చయ్య, నాగరాజు, రవి, వెంకటేశ్వర్లు, సైదులు, జహీర్, ప్రసాద్, సుశీల, సైదమ్మ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీపీఎంల చేతివాటంపై విచారించాలి

సాక్షి ఎఫెక్ట్..

చండూరు : ఆసరా పింఛన్ల పంపిణీలో బీపీఎంల చేతివాటంపై పోస్టల్ సూపరింటెండెంట్ రఘునాథస్వామి స్పందించారు. చండూరు, గట్టుప్పల మండలాల పరిధిలోని గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో అవకతవకలపై శనివారం 'సాక్షి'లో 'బీపీఎంల చేతివాటం' శీర్షికన ప్రచురితమైన కథనానికి పోస్టర్ సూపరింటెండెంట్ స్పందించారు. చండూరు, గట్టుప్పల మండలాల్లో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఐపీఎంను ఆదేశించారు. ఆ ఆదేశాల మేరకు సోమ, మంగళవారాలలో విచారణ చేయడంతో పాటుగా బీపీఎంలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఐపీఎం తెలిపారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి : మూసీ రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 1,858 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు రెండు క్రస్టు గేట్లను పైకెత్తి దిగువకు 1,290 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు 568 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 643.48 అడుగుల (4.06 టీఎంసీల) వద్ద ఉంది.



మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

గజ్జెకట్టి.. గళమెత్తి..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉద్యమాలకు ఊపిరులూదిన గద్దర్

- ప్రజా సమస్యలపై యుద్ధనౌక పోరుబాట
- నక్సల్స్ మృతదేహాలను కుటుంబాలకు అప్పగించాలని నల్లగొండలో ధర్నా
- యురేనియం, ఫ్లోరోసిస్ వ్యతిరేక పోరాటాల్లో కీలకపాత్ర
- తెలంగాణ మలిదశ ఉద్యమంలో ధూంధాంలు
- జిల్లాతో విడదీయరాని అనుబంధం



నల్లగొండలో నిర్వహించిన తెలంగాణ ధూంధాంలో మాట్లాడుతున్న గద్దర్ (ఫైల్)



నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ధర్నాలో పాటలు పాడుతున్న గద్దర్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : విప్లవ కవి, ప్రజా యుద్ధ నౌక, ప్రజా గాయకుడు గద్దర్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదారు. భువనగిరిలో ఉద్యోగం నుంచి మొదలుకొని ఉద్యమంవైపు నడిచే వరకు, ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు, ప్రజాస్వామిక ఉద్యమాలన్నింటిలోనూ గద్దర్‌కు జిల్లాతో విడదీయరాని బంధం ఉంది. పీడిత ప్రజల పక్షాన జిల్లాలో నిర్వహించిన అనేక పోరాటాల్లో కీలక పాత్ర పోషించారు. జిల్లాలో రాజ్యాహింసకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా గళమెత్తారు. జిల్లాలో జరిగిన అనేక ప్రజాస్వామి ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు. ఫ్లోరోసిస్, యురేనియం వ్యతిరేక, రైతాంగ పోరాటాలు, సొరంగమార్గం సాధన కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. పులిచింతల ప్రాజెక్టుతో ఆంధ్రాకే మూడు పంటలకు నీరు పోతుందని, తెలంగాణకు ఒక్క పంటకు కూడా నీరందని, దాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. ఇలా జిల్లాలో జరిగిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్న గద్దర్‌కు జిల్లాతో విడదీయరాని ఉద్యమ బంధం ఏర్పడింది.

ఫ్లోరోసిస్‌పై పోరాటం

నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యతో 30 ఏళ్లకే ముసలివారై మృత్యువాత పడుతున్న పరిస్థితులపై గద్దర్ గళమెత్తారు. ఆ సమస్య పరిష్కరించాలంటూ చేసిన ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి అధ్యక్షుడు కంచుకంట్ల సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఫ్లోరైడ్ విముక్తి ఉద్యమానికి గద్దర్ బాసటగా నిలిచారు. ఫ్లోరోసిస్‌ను పూర్తిగా రూపుమాపేందుకు కృష్ణా జలాలు అందించాలనే డిమాండ్‌తో నిర్వహించిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పాలనలో 2012లో స్పీకర్‌గా ఉన్న నాదెండ్ల మనోహర్ వచ్చిన సమయంలో గద్దర్ పాల్గొని పరిస్థితిని వివరించారు. చండూరు, మర్రిగూడ మండలాల్లో నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఫ్లోరైడ్ సమస్య నుంచి బయటపడాలంటే నదీ జలాలే శరణ్యమని, అందుకు ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తి చేయాలంటూ జరిగిన ఉద్యమాలకు మద్దతుగా ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ప్రజలు పడుతున్న గోసలను వివరించి జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు.

- దేవరకొండ నియోజకవర్గంలో యురేనియం ప్రాజెక్టు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజలకు బాసటగా నిలిచారు. యురేనియం ప్రాజెక్టు నిర్మిస్తే దాని ప్రభావం నాగార్జునసాగర్ జలాలపై పడుతుందని, దానివల్ల జీవరాశులకు ప్రమాదం వాటిల్లుతుందని చేపట్టిన ఉద్యమాల్లో గద్దర్ పాల్గొన్నారు.

గద్దర్ పోరాటాలు ఇలా..

- 1976 ప్రాంతంలో జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో అమరవీరుల సంస్మరణ సభకు హాజరయ్యారు.
- 1999లో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించిన మారోజు వీరన్న అంత్యక్రియలకు ఆయన స్వగ్రామం తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం వచ్చారు.
- పులిచింతల ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం పూనుకోగా దాన్ని పూర్తిగా వ్యతిరేకించారు గద్దర్. ఆ ప్రాజెక్టు వల్ల ఆంధ్రాకు మూడు పంటలకు నీరందుతుందని, నల్లగొండ జిల్లాకు మాత్రం తాగునీటికి కూడా తిప్పలు తప్పవని చేపట్టిన ఉద్యమాల్లో పాల్గొన్నారు.
- సీపీఎం ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన బీఎల్ఎఫ్, అంబేద్కర్ జాతా, టీమాస్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- 1999లో పౌరహక్కుల సంఘం నాయకుడు ఆజాం అలీ హత్య నల్లగొండలో జరిగింది. ఆ సందర్భంలోనూ గద్దర్ వచ్చి ఇది నయీంతో పోలీసులే చేయించారంటూ ఆరోపించారు.
- 1999లో తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో జరిగిన బెల్లి లలిత హత్య నేపథ్యంలో, ఆ తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన కార్యక్రమాల్లో గద్దర్ పాల్గొన్నారు. ప్రభుత్వం చేయించిన హత్యగా అభివర్ణించారు.
- 2009 మే 8న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భీంరెడ్డి నరసింహారెడ్డి సంతాప సభకు హాజరయ్యారు.
- కేసీఆర్ ప్రారంభించిన మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ గద్దర్ ప్రముఖ పాత్ర పోషించారు. జిల్లాలో జరిగిన తెలంగాణ ధూం ధాం కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొన్నారు. తెలంగాణ సాధన కోసం మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావుతోపాటు దుబ్బాక నర్సింహారెడ్డి నేతృత్వంలో నిర్వహించిన పాదయాత్రను గద్దర్ ప్రారంభించారు. జిల్లాలో జరిగిన రైతాంగ పోరాటాల్లోనూ పాలుపంచుకున్నారు.
- మిర్యాలగూడలో ప్రణయ్ హత్య తర్వాత జరిగిన ఉద్యమంలోనూ గద్దర్ పాల్గొన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.
- ఇటీవల సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క నిర్వహించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా జూన్ 27వ తేదీన చివ్వెంల మండలం తిమ్మాపురం, మోదీన్‌పురం, బి.చందుపట్ల గ్రామాల్లో గద్దర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు చేశారు.

వీటితోపాటు ఇంకా ఎన్నో కార్యక్రమాల్లోనూ గద్దర్ పాల్గొన్నారు. జిల్లాతో ఆయనకు ఉద్యమపరంగా విడదీయరాని బంధం ఉంది.

- నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం పావురాల గుట్ట (పెద్దచౌడు) గుట్టల్లో ఎన్‌కౌంటర్‌లో నక్సలైట్ నాయకుడు దివాకర్ సహా 11మంది మృతి చెందారు. ఆ సందర్భంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి వచ్చి ఆ కుటుంబాలకు బాసటగా నిలిచారు. ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ చేసిందని ఆరోపణలు చేసిన గద్దర్, ఎన్‌కౌంటర్ చనిపోయిన నక్సలైట్ల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. దీంతో గద్దర్‌పై నల్లగొండ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసులో అరెస్టయిన గద్దర్ రెండు రోజులు జైల్లో ఉన్నారు. ఆయనతోపాటు అడ్వకేట్లు జి.వెంకటేశ్వర్లు, జి.మోహన్‌ను కూడా అరెస్టు చేశారు. ఆ తరువాత ప్రభుత్వం ఆ కేసును ఉపసంహరించుకుంది.

ఉద్యమ పొద్దు పొడిచిందిక్కడే..!



1996లో భువనగిరికి వచ్చిన గద్దర్, పక్కన జైని మల్లయ్య గుప్తా తదితరులు

సాక్షి, యాదాద్రి : ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఉద్యమ ప్రస్థానం యాదాద్రి జిల్లా భువనగిరి నుంచి ప్రారంభమైంది. 1983 నుంచి 2023 వరకు ఆయనకు భువనగిరి ప్రాంతంతో విడదీయలేని ఉద్యమాను బంధం ఉంది. భువనగిరి పట్టణంలోని గంజ్‌లో ఉన్న కెనరా బ్యాంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తూ పేదలకు బ్యాంక్‌లో గౌరవం దక్కాలని బ్యాంకు మేనేజర్‌ను నిలదీశారు. పీడిత ప్రజలకు గౌరవం దక్కనిచోట పనిచేయలేనని ఉద్యోగం వదిలి ఉద్యమంలోకి నడిచారు. ఇక్కడ బ్యాంకులో ఉద్యోగం చేసే సమయంలో రైల్వేస్టేషన్ బస్తీలో నాగారం ముత్తయ్య, లక్ష్మమ్మ దంపతులకు చెందిన పూరి గుడిసెలో ఆయన అద్దెకు ఉండేవారు. ఆ ఇంటి ఆవరణలోనే కూర్చొని పాటలు రాసి పాడేవారు. భువనగిరిలో తెలంగాణసాయుధపోరాట యోధుడు జైని మల్లయ్య గుప్తతో పాటు మరికొందరితో కలిసి ఉండే వారు. 1995 జూలై 19న భువనగిరి వర్తక సంఘంలో జరిగిన డపోడం (దళిత మైనార్టీ హక్కుల కార్యాచరణ వేదిక)లో పాల్గొన్న గద్దర్ పీపుల్స్ వార్ ప్రజా సంఘాలపై నిషేధం ఎత్తివేయాలని పోరాడారు. 1997 మార్చి 8, 9 తేదీల్లో భువనగిరిలో 'దగా పడ్డ తెలంగాణ' పేరుతో జరిగి రెండు రోజుల కార్యక్రమంలో గద్దర్ పాల్గొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఈ సభ డిమాండ్‌కు మద్దతు పలికారు. 2021 ఆగస్టులో యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని యాదగిరినర్సన్నో అంటూ పాడిన పాట అప్పట్లో చర్చ నీయాంశమైంది. రీజినల్ రింగ్ రోడ్డు రాయిగిరి బాధితుల కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షకు గద్దరు మద్దతు ప్రకటించారు. హైదరాబాద్ నుంచి వరంగల్ జిల్లాకు ఎప్పుడు వెళ్లినా భువనగిరి ఆలేరులో ఆగి అభిమానులతో కలిసిటీ తాగే వారు. ఆలేరు మండలం రాఘవాపురానికి చెందిన పీపుల్స్‌వార్ నాయకుడు రమేశ్ ఉమ్మడి మెదక్‌జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా అతని అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

'గ్యాంగోళ్లమండి మేము బాబు' పాట పురుడుపోసుకుంది భువనగిరిలోనే..

గుమ్మడి విఠల్ అలియాస్ గద్దర్ భువనగిరిలో బ్యాంక్‌ఉద్యోగం చేస్తున్నప్పుడు మధ్యాహ్న భోజనం కోసం రైల్వేస్టేషన్ వెళ్లి అక్కడ కూర్చొని తినేవారు. ఆ సమయంలో రైల్వే ట్రాక్‌పై లాడీస్‌లో దొరను కూర్చోబెట్టి గ్యాంగ్ మెన్లు మండుటెండలో నెట్టుకుంటూ పోతుండగా వారి కష్టాన్ని చూసి చలించిన గద్దర్.. 'గ్యాంగోళ్ల మండి మేము బాబు, గరీబోళ్లమండిమేము బాబు' అంటూ పాటను రాశారు. ఆ తర్వాత పాట ఎంతో ఫేమస్ అయిన విషయం తెలిసిందే.



హైదరాబాద్‌లో గద్దర్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకరరెడ్డి తదితరులు

● ఫ్యాషన్ షో అదుర్స్



భూదాన్‌పోచంపల్లిలో ఆదివారం చేనేత టై అండ్ డై అసోసియేషన్, సొసైటీ ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ టు అచీవ్ (సేవా) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. మిసెస్ ఇండియా తెలంగాణ మమత త్రివేదితో పాటు 30 మంది ఫ్యాషన్ డిజైనర్లు ఇక్కత్ వస్త్రాలు ధరించి, చేనేత వైభవం చాటే ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాంప్‌వాక్ నిర్వహించి అలరించారు.

- భూదాన్‌పోచంపల్లి

తరగని 'చేనేత' వైభవం! - 8లో

తెలంగాణ ఏర్పాటులో జయశంకర్ పాత్ర కీలకం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ ఉద్యమంతోపాటు రాష్ట్రం ఏర్పాటులో ప్రొఫెసర్ జయశంకర్ కీలక పాత్ర పోషించారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆదివారం నల్లగొండ పట్టణంలోని పంచతత్వ పార్కులో జయశంకర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాంతం పోరాడిన వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, సుంకరి మల్లేష్‌గౌడ్, కటికం సత్తయ్యగౌడ్, అభిమన్యు శ్రీనివాస్, జమాల్‌ఖాద్రీ, ఆలకుంట్ల నాగరత్నంరాజు, వట్టిపల్లి శ్రీనివాస్, పున్న గణేష్, బోయినపల్లి శ్రీనివాస్, భాస్కర్‌గౌడ్, బోనగిరి దేవేందర్, సందినేని జనార్దన్‌రావు, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మిర్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దళితులను దగా చేస్తున్న ప్రభుత్వం

నల్లగొండ : దళితబంధు పేరుతో దళితులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేస్తోందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్ విమర్శించారు. ఆదివారం నల్లగొండలో జిల్లా దళిత కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా శంకర్, ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వేదాసు శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన దళితులకు దళితబంధు ఇవ్వకుండా, బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే ఇస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు ఇచ్చామని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇల్లు, మూడు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం గద్దర్ ఫ్లెక్సీకి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, కౌన్సిలర్స్ బొజ్జ శంకర్, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పెరిక వెంకటేశం, జూకురి రమేష్, కురుపాటి గణేష్, పేరిక మధు, కౌన్సిలర్ ఆనంద్, బొజ్జ నాగరాజు, బుర్రి యాదయ్య, ఏర్పుల రవి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

నల్లగొండ టూటౌన్ : మూడు సంవత్సరాలకు పైబడి పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా బాధ్యుడు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని టీఎన్‌జీఓ భవన్‌లో జరిగిన జేఏసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి ఏజెన్సీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సంతోష్, జె.వినోద్, కృష్ణ, గోవర్ధన్, రాము తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



నల్లగొండలో నిర్వహించిన బీసీల సింహ గర్జన సభలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, నాయకులు

నల్లగొండ టౌన్ : రాజ్యాధికారం సాధించినప్పుడే బీసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ సింహగర్జన సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు 5 శాతంగా ఉన్న అగ్రకులాలే రాజ్యామేలుతున్నాయని, జనాభాలో సగభాగంగా ఉన్న బీసీలు నేటికీ ప్రధానమంత్రిగా, ముఖ్యమంత్రిగా సుప్రీం కోర్టు జడ్జిలుగా కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు తమ ఓటును తమ వారికి వేసుకోవడం ద్వారా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా ఉన్నత పదవులు పొందేలా చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాధికారం ఇవ్వకుండా కేవలం గొర్రెలు, మేకలు, బర్రెలు, చేపపిల్లలను ఇస్తూ బీసీల బతుకులను దుర్భరం చేస్తున్న అగ్రకులాలకు దీటుగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో 6, రెండు పార్లమెంట్ స్థానాల్లో ఒకటి బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టించి పార్టీల మెడలువంచి ఆమోదింప జేయిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్.కృష్ణయ్యను ఆయా సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతికి సంతాపం తెలిపారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేశ్, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్, జిల్లా మార్కండేయులు, తండు సైదులుగౌడ్, నాయకులు పిల్లి రామరాజు, పున్నకైలాస్, ఎల్‌వీ.యాదవ్, మిర్యాల యాదగిరి, వినోద్‌చారి, జిల్లేపల్లి అంజి, వంగూరు నారాయణయాదవ్, నర్సింహగౌడ్, మునాస ప్రసన్నకుమార్, మామిడి పద్మ, సింగం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

నల్లగొండ క్రైం : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. నల్లగొండ మున్సిపాలిటీ పరిధి కతాల్‌గూడేనికి చెందిన పాలకూరి అంజయ్యగౌడ్ (51) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రోజు మాదిరిగా వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ వైరును కర్ర తో తొలగిస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఆ వైరు అతడికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. సమీప రైతులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఒకరోజు వ్యవధిలో దంపతుల మృతి


ముత్తయ్య (ఫైల్)

మర్రిగూడ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన దంపతులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోజు వ్యవధిలో మృతిచెందారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామానికి చెందిన సిలివేరు ముత్తయ్య(58) భార్య పుల్లమ్మతో కలిసి శుక్రవారం నాంపల్లి మండలంలోని లింగోటం గ్రామంలోని బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తున్నారు. మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయం సమీపాన డీసీఎం ఢీకొట్టడంతో దంపతులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్‌కు తరలించగా ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం పుల్లమ్మ మృతిచెందగా ఆదివారం ఆమె భర్త సిలివేరు ముత్తయ్య కూడా మృతిచెందాడు. ఒక్క రోజు వ్యవధిలోనే భార్యభర్తలిద్దరూ మృత్యుఒడికి చేరడంతో వారి ఇద్దరు కుమారులు, కుమార్తెతోపాటు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దంపతులత మృతితో యరగండ్లపల్లిలో విషాదం అలుముకుంది. మృతుల కుమారుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రంగారెడ్డి తెలిపారు.

ఉద్యమగడ్డ నుంచే పోరుబాట..!

- ఖోరు కెరటం ఎగిసింది.. 'నల్లగొండ' జిల్లాలోనే..
- ప్రభుత్వ ఉద్యోగం వదిలి ఉద్యమం వైపు అడుగులు
- ఆటపాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన గద్దర్
- ఉమ్మడి జిల్లాతో విడదీయని అనుబంధం


2017 మార్చి 16న సీపీఎం చేపట్టిన మహాజన పాదయాత్రలో భాగంగా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూర్‌లో ప్రసంగిస్తున్న గద్దర్

ఎన్నో ఉద్యమాలకు నెలవైన ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే ప్రజాయుద్ధ నౌక గద్దర్ పోరుబాట పట్టారు. బడుగులకు గౌరవం దక్కని చోట తాను పనిచేయలేనంటూ 1980 దశకంలోనే భువనగిరిలో బ్యాంకు ఉద్యోగాన్ని వదిలి ఉద్యమాల వైపు అడుగులేశారు. తన ఆటపాటలతో తాడిత పీడితుల్లో చైతన్యాన్ని రగిల్చి తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో గద్దర్‌కు విడదీయని అనుబంధమే ఉంది. నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి జిల్లాలో జరిగిన అనేక పోరాటాల్లో ఆయన పాల్గొని పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను తన మాటల తూటాలతో ఎండగట్టారు.

సూర్యాపేట : ప్రజాయుద్ధ నౌక గద్దర్‌కు సూర్యాపేట జిల్లాతో అవినాభావ సంబంధం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఆయనకు తన పాటతో సంబంధం ఉండగా.. ఇక్కడ మాత్రం పాటతో పాటే రాజకీయంగా వీడదీయరాని అనుబంధం ఉంది. ఆది నుంచి జిల్లాలో కమ్యూనిస్టులు, నక్సలైట్ పార్టీలు ప్రాబల్యం ఉండడంతో వారంతా గద్దర్‌కు అభిమానులుగా ఉన్నారు. మొట్టమొదట 1976లో జాజిరెడ్డి గూడెంలో అమరవీరుల సంస్మరణ సభకు హాజరై గ్రామ వీధుల గుండా అగ్గిపెట్టె మీద దరువేస్తూ పాటలు పాడడం సంచలనంగా మారింది. వీడే నమ్మో డబ్బున్న బాడకావ్... వీడే నమ్మో దయలేని బాడకావ్.. అంటూ భూస్వాములు, పెత్తందారులపై.. పోదాం పదే జాతర.. నక్సల్బరీ జాతర.. అంటూ వీధుల్లో పాటలు పాడి ఉర్రూతలూగించారు. అనంతరం 2007లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలను చైతన్యం చేసేందుకు సూర్యాపేటలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు.

అన్నివర్గాల సంతాపం

గద్దర్ ఇక లేరన్న విషయాన్ని తెలుసుకున్న జిల్లాలోని ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలతో పాటు ఇతర అన్ని వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యారు. పీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. గద్దర్ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో, తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో వేర్వేరుగా సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ర్యాలీలు నిర్వహించారు.

గుండ్రాంపల్లి అమరవీరుల స్థూపం సందర్శన

చిట్యాల: 2008లో నిజాం నవాబులను పొగుడుతూ పలు సందర్భాల్లో ప్రస్తుత సీఎం కేసీఆర్ ప్రకటనలు చేశారు. దీంతో తెలంగాణ సాయుధ పోరాట వీరుల ఆత్మలు ఘోషిస్తున్నాయంటూ చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని తెలంగాణ అమరవీరుల స్మారకస్థూపానికి గద్దర్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా 'అమ్మ తెలంగాణ గానమా.. ఆకలి కేకలా గానమా' అంటూ ఆయన పాట పాడారు. 2017లో డిసెంబర్ 29న టీమాస్ తరఫున చిట్యాలలో నిర్వహించిన ధూంధాం సభలో భాగంగా ఆయన ఆటపాటలతో అలరించారు.

మునుగోడు ఉప ఎన్నికల్లో కీలకంగా పనిచేసిన గద్దర్

మునుగోడు : ప్రజా గాయకుడు గద్దర్ గత ఏడాది నవంబర్ మాసంలో జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో కీలకంగా పనిచేశారు. దాదాపు ఐదు రోజుల పాటు మునుగోడులోనే మకాం వేసి ప్రజాశాంతి పార్టీ నుంచి పోటీ చేసిన డాక్టర్ కె ఏ పాల్‌కు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని డాక్టర్ కే ఏ పాల్‌ను గెలిపిస్తే పేదలకు మంచి జరుగుతుందని తన పాటల రూపంలో ఆయన ప్రచారం కొనసాగించారు.

భట్టి పాదయాత్రలో..

చివ్వెంల(సూర్యాపేట) : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా జూన్ 27న చివ్వెంల మండల పరిధిలోని తిమ్మాపురం, మోదిన్‌పురం, బి.చందుపట్ల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ శాసన సభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో ప్రజా యుద్ధనౌక గద్దర్ పాల్గొన్నారు. ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు చేశారు. ప్రజా పార్టీ స్థాపన తర్వాత మొదటి సారి కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతున్నట్లు పేర్కొన్నారు. తన ఆటపాటతో ప్రజల మన్ననలు పొందారు.


తిమ్మాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గద్దర్ (ఫైల్)


నార్కట్‌పల్లి : ఎంబీసీ జిల్లా కార్యదర్శి నలపరాజు సైదులు ఇంట్లో భోజనం చేస్తున్న గద్దర్

గద్దర్ మృతి తీరనిలోటు



గద్దర్ పాటలకు ఆకర్షితునై 1978లో ఆయన అభిమానిగా మారా. అప్పటి నుంచి ఆయన వెంట ఉంటూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నా. తెలంగాణ ప్రజలు గోసను పాటల రూపంలో తెలియజేయడంతో ఆయనను మించిన వారులేరు. ఆయన మృతి తీరని లోటు. ఇటీవల ఆయన ఇంటికి వెళ్లి కలిసి వచ్చా.

– భువనగిరి శ్రీనివాస్‌నేత, భువనగిరి

ఆటపాటలతో..



ప్రజా గాయకుడు గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటు. జిల్లాలోని సమస్యల పరిష్కారం కోసం తరచుగా వచ్చి ఆటపాటలతో ప్రభుత్వానికి తెలియజేసే వారు. ప్రజలను, ప్రజా సంఘాలను చైతన్య పరిచిన వ్యక్తి. ఆయన మృతి జిల్లాలో కవులు, కళాకారులు జీర్ణించుకోలేకపోతున్నారు.

– తంగళ్లపల్లి రవికుమార్, భువనగిరి

మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసిన గద్దర్



మలి దశ ఉద్యమానికి ఊపిరి పోసిన గొప్ప ప్రజా గాయకుడు గద్దర్. ఆయన మృతి తెలంగాణకు తీరని లోటు. తెలంగాణ గొప్ప కళాకారుడిని కోల్పోయింది. గద్దర్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి.

– రావి సురేందర్‌రెడ్డి, టీజేఏస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

యాదాద్రీశుడి సన్నిధిలో..

- 2017, 2021, 2022లో నృసింహుడి దర్శనం

యాదగిరిగుట్ట : ప్రజాయుద్ధ నౌక గద్దర్‌కు యాదగిరిగుట్టతో పాటు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంతో మంచి అనుబంధం ఉంది. 2017 మార్చి 16న యాదాద్రీశుడిని దర్శించుకొని, సీపీఎం చేపట్టిన మహాజన పాదయాత్రలో పాల్గొన్నారు. యాదాద్రి ప్రధానాలయం పూర్తి కాకముందు 2021 డిసెంబర్ 19న వచ్చిదేవుడిపై పాట పాడి వెళ్లారు. ప్రధానాలయం ఉద్ఘాటన జరిగిన తరువాత 2022 ఆగస్టు 25న వచ్చారు. ఆదివారం గద్దర్ చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిన వెంటనే యాదగిరిగుట్టతో పాటు యాదాద్రి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

నర్సన్న.. యాదగిరి నర్సన్నా అంటూ

'నర్సన్న మా నర్సన్న యాదగిరి నర్సన్నా.. మా బీడోళ్లందరినీ సల్లంగా చూడన్నో మాయన్నో.. యాది మర్చిపోకన్నో మాయన్న మా నర్సన్న అంటూ.. మంచిగా మొక్కుతున్న ఆశీర్వదించు అంటూ.. 2021 డిసెంబర్ 19న తూర్పు రాజగోపురం వద్ద మోకాళ్లపై కూర్చొని స్వామిని మొక్కుతూ తన పాటతో ఆకట్టుకున్నారు.' అప్పుడు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీస్వామిని దర్శించుకున్న గద్దర్ తిరిగి 2022 ఆగస్టు 25న దర్శించుకున్నారు. ఎప్పుడు గోసి, గొంగడి, చేతిలో కర్రతో కనిపించే గద్దర్ చేతిలో కర్ర లేకుండా, నల్లని సూట్, మెడలో ఎర్రటి టైతో కనిపించి అప్పట్లో అందరిరనీ ఆకట్టుకున్నారు.


2021లో డిసెంబర్ 19న స్వామివారిని మొక్కుతున్న గద్దర్

కన్నీటి దండేద్దునా..శేషన్నా


ఉద్యమ కాలంలో మిర్యాలగూడలో గద్దర్‌తో కలసి అభివాదం చేస్తున్న నాయకులు (ఫైల్)

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామానికి చెందిన ఆర్ఎస్‌యూ విద్యార్థి విభాగానికి చెందిన శేషయ్య 1984వ సంవత్సరంలో నల్లగొండలో హత్యకు గురయ్యారు. అప్పట్లో చిల్లాపురంలో నిర్వహించిన శేషయ్య స్థూపావిష్కరణలో గద్దర్ పాల్గొన్నారు. 'నా దగ్గరేముంది నీకేమినేనిద్దు... కన్నీటి దండేద్దున శేషన్నా.. అంటూ పాటతో కన్నీటి నివాళులర్పించారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన పౌరహక్కుల సంఘం నేత ఎండీ.ఆజంఅలీ 2002లో నల్లగొండ పట్టణంలో అతి దారుణంగా హత్య గావించబడ్డాడు. అతని దహన సంస్కారాలకు మిర్యాలగూడకు వచ్చి భారీ ప్రదర్శనతో అంత్యక్రియలో పాల్గొన్నారు. 2009 నవంబర్‌లో తెలంగాణ ఉద్యమ సమయంలో మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆటపాట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని తన పాటల ద్వారా ప్రజలను చైతన్యపరిచారు.

చౌటుప్పల్ ప్రాంతంతో..

చౌటుప్పల్ : ప్రజాగాయకుడు గద్దర్‌కు చౌటుప్పల్ ప్రాంతంతో అనుబంధం చాలానే ఉందని చెప్పవచ్చు. ఏదో ఒక కార్యక్రమం ద్వారా ఇక్కడికి విచ్చేస్తుండేవారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ సారథ్యంలో గ్లోబల్ పీస్ హోస్ట్ కమిటీ సంస్థలో మెంబర్‌గా ఉన్న ప్రజాగాయకుడు గద్దర్ గతేడాది సెప్టెంబరు 15న చౌటుప్పల్‌కు విచ్చేశారు. అదే నెల 25న జరిగే తన జన్మదినాన్ని పురస్కరించుకొని చౌటుప్పల్ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తానని కేఏపాల్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రాంతంలో అనువైన భూములను గుర్తించేందుకుగాను గద్దర్ విచ్చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో ఆప్యాయంగా పలకరించి మాట్లాడారు. దివంగత వైఎస్‌రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మావోయిస్టులతో చర్చల ప్రక్రియ ప్రారంభాన్ని పురస్కరించుకొని మావోయిస్టు అగ్రనాయకులకు ఇక్కడే స్వాగతం పలికి హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. జాతీయ రహదారి మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే క్రమంలో ఇక్కడ ఆగిన సందర్భాలు చాలానే ఉంటాయి. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో మారుమూల ప్రాంతాలకు సైతం వెళ్లారు.


పంతంగిలో గ్రామస్తులతో సరదాగా గద్దర్ (ఫైల్)

గద్దర్‌కు సర్వేల్‌తో అనుబంధం

సంస్థాన్ నారాయణపురం: 1989లో జననాట్యమండలి ఆధ్వర్యంలో సర్వేల్‌లో బహిరంగ సభను నిర్వహించారు. అప్పుడు గద్దరు పాడిన పాటలకు ఇక్కడి ప్రజలు అకర్షితులయ్యారు. గత సంవత్సరం డిసెంబర్ 25న సర్వేల్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీర వనిత చిట్యాల(చాకలి) ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు.


సర్వేల్‌లో పాట పాడుతున్న గద్దర్ (ఫైల్)


2007లో సూర్యాపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గద్దర్ (ఫైల్)


పొడిచేడులో శ్రీకాంత్‌చారి తల్లి శంకరమ్మతో గద్దర్‌తో (ఫైల్)


చిట్యాలలో సీపీఎం నాయకులతో గద్దర్(ఫైల్)


నల్లగొండ, భువనగిరి ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో గద్దర్ (ఫైల్)


తెలంగాణ సాయిధ పోరాటయోధుడు భీంరెడ్డి నర్సింహారెడ్డితో గద్దర్ (ఫైల్)

పోచంపల్లితో...

భూదాన్‌పోచంపల్లి : ప్రజాగాయకుడు గద్దర్‌తో పోచంపల్లికి ఎంతో అనుబంధం ఉంది. 2017 జూన్ 5 మండలంలోని భీమనపల్లి గ్రామంలో మహాజన సమాజం, మహాజన గళం ఆధ్వర్యంలో నిర్వహించిన త్యాగాల తెలంగాణకు వందనం సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభలో పాటలు పాడుతూ, గంతులెస్తూ సభికులను ఉత్తేజ పరిచారు. 2008లో నవతెలంగాణ ప్రజాపార్టీ అధ్యక్షుడు టి.దేవేందర్‌గౌడ్ పోచంపల్లిలో నిర్వహించిన బహిరంగసభలో గద్దర్ పాల్గొన్నారు.


భీమనపల్లిలో పాట పాడుతూ గంతులేస్తున్న గద్దర్ (ఫైల్)

గద్దర్ కలం.. నర్సిరెడ్డి గళం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ గద్దర్‌గా పిలిచే నర్సిరెడ్డికి గద్దర్‌కు ఇటీవలి కాలంలోనే ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. గద్దర్‌లాంటి గొంతుతో పాటలు పాడే నర్సిరెడ్డిని నాలుగు నెలల కిందట గద్దర్ ప్రత్యేకంగా హైదరాబాద్‌కు పిలిపించుకున్నారు. తెలంగాణ వచ్చినా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని, ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వానివి మోసపూరిత మాటలేనని నర్సిరెడ్డితో పేర్కొన్న గద్దర్ తాను రాసిన పాట పాడాలని చెప్పారు. అదే అదృష్టంగా భావించిన నర్సిరెడ్డి ఆ పాటను పాడారు.

నన్నుగన్న తల్లుల్లారా... తెలంగాణ పల్లెల్లారా...
తెలంగాణ పల్లెల్లారా.... నన్నుగన్న తండ్రూలారా..
పాదయాత్రనై వస్తున్న నాయన్నలారా..
మీ పాదాలకు వందనాలమో మా యమ్మాలారా...
జైత్రయాత్రనై వస్తున్న మా యన్నాలారా..
జయము జయము అంటుండ్రమ్మా... మా యన్నలారాలా..
కమిలీ కమిలీ ఏడిచే కన్న కుంపటోలే మండుదాము..
నొప్పులతోని చచ్చేకన్న ఉప్పెనలై ఉరుముదాము..

అంటూ విప్లవ కవి గద్దర్ రాసిన పాటను నర్సిరెడ్డి పాడారు.

IN THE COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD
W.P.NO.41169 OF 2023

Between:
1. Narendruni Udayamma W/o.Late Dayakar Rao, Aged 70 years, R/o.1-2-270/16 Kudakuda Road, Suryapeta Town, Suryapet District.
2. Narendruni Sridhar S/o.Late Dayakar Rao, Aged 50 years, R/o.1-2-270/16 KudakudaRoad, Suryapeta Town, Suryapet District. ...Petitioners

And

1. The State of Telangana Rep. by its Principal Secretary, Revenue Department, Secretariat, BRKR Bhavan, Hyderabad 500 029 and6 others. ...Respondents

NOTICE

To,
5.Narendruni Vidyasagar Rao, S/o.Ramaiah, aged 67 years R/o. H.No.1-2-270/17, M.G.Road, Suryapet, Suryapet District.
6. Kambampati Jyothi, W/o. Mangaiah, Near Anthodya Mahila Sangam Office, Kudakuda Village, Mandal Suryapet, Suryapet District.
7. Thodupunoori Kasthuri, W/o. Late Muralidhar, H.No.1-1-192/2, J.J.Nagar, Opp.Govt. Junior College, Suryapet, Suyrapeta District. ...Respondents

Please take Notice in the above case filed by my clients **Narendruni Udayamma and Narendruni Sridahar** before the Hon'ble High Court challenging the Proc.No.MUT/29/21/00004 of 2020, Dt. 04.01.2020 of the 4th respondent i.e., The Tahsildar and the above Writ Petition came for admission and hearing before the Hon'ble High Court on 03.08.2023 and after hearing the Hon'ble High Court posted the matter to 10.08.2023 and permitted take notice on you through Paper Publication. Therefore take notice in the above case and appear in person or through counsel on 10.08.2023 before the Hon'ble High Court, failing which the Court will pass orders on merits on record available.

//BY ORDER OF THE HIGH COURT FOR THE STATE OF TELANGANA//
CH.JANARDHAN REDDY
ADVOCATE
PHONE NO.9948154030

తరగని 'చేనేత' వైభవం..!

- పోచంపల్లి వస్త్రాలకు అంతర్జాతీయ ఖ్యాతి
- ఇక్కడ తయారవుతున్న వస్త్రాలు దేశ విదేశాలకు ఎగుమతి
- ఉమ్మడి జిల్లాలో చేనేతపై ఆధారపడి 30వేలమంది జీవనం
- పాలకులు న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటున్న నేత కార్మికులు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

భూదాన్‌పోచంపల్లి : అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసిన ఘన కీర్తి మన నేతన్నలది. ఆరు దశాబ్దాల కాలంలో చేనేత పరిశ్రమ అనేక ఆర్థిక ఆటుపోటులు, కరోనా లాంటి సంక్షోభాన్ని ఎదుర్కొని నిలబడింది.మారుతున్న కాలానుగుణంగా నేతన్నలు కూడా చేనేతలో ఎన్నో అద్భుతాలు, ఆవిష్కరణలకు జీవం పోస్తూ పరిశ్రమను సజీవంగా నిలుపుకుంటూ వస్తున్నారు.

శరాఘాతంగా నిబంధనలు

పాలకులు చేనేత కార్మికులకు అనేక పథకాలు అమలు చేస్తున్నా వాటిలో ఉన్న కఠిన నిబంధనల వల్ల ప్రభుత్వ ఫలాలు పూర్తి స్థాయిలో కార్మికులకు దరిచేరడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం నూలుపై ఇస్తున్న 40శాతం సబ్సిడీ పథకంలో నిబంధనలను సరళీకృతం చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. నూలు, చేనేత వస్త్రాలపై విధించిన 5శాతం జీఎస్టీ గుదిబండగా మారింది. 59 ఏళ్ల వయస్సు లోపు ఉన్న వారికే నేతన్న బీమా పథకం, రద్దయిన ఆరోగ్య బీమా పథకాన్ని పురరుద్ధరించాలని, ఆధునిక మగ్గాలు ఇవ్వాలని కోరుతున్నారు.

ఎల్లలు దాటిన ఇక్కత్ కళ

పోచంపల్లి ఇక్కత్ కళ ఎల్లలు దాటింది. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ ఫ్రాన్స్ పర్యటనలో ఆ దేశ అధ్యక్షుడి భార్య బ్రిగ్గేట్టే మెక్రాన్‌కు ఇక్కడి నేతన్నలు నేసిన ఇక్కత్‌చీరను బహూకరించారు. అంతేకాక యునెస్కో అనుబంధ సంస్థ ప్రపంచ పర్యాటక సంస్థ చేనేత అనే కుటీర పరిశ్రమ ద్వారా సంప్రదాయ వృత్తి, వారసత్వ సంపదను కాపాడుకొంటూనే పలువురు ఉపాధి పొందుతున్నందుకు గాను


మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

2021లో పోచంపల్లికి అంతర్జాతీయ బెస్ట్ టూరిజం విలేజ్ అవార్డు రావడంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇక్కత్ చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి క్రేజీ ఉంది. ఇక్కడ తయారవుతున్న వస్త్రాలు దేశ, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

చేనేతలో ప్రయోగాలు

పోచంపల్లి వస్త్రాలకు మొట్టమొదటి సారిగా 2003లో కేంద్ర ప్రభుత్వం జీయోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీ(పేటెంట్) సర్టిఫికెట్ జారీచేసింది. ఇందులో పోచంపల్లి చేనేత 11రకాల డిజైన్లకు రిజర్వేషన్లుతో పాటు చేనేత వస్త్రాలైన చీరలు, రుమాలు, కార్పెట్, బెడ్‌షీట్స్, మ్యాట్స్ పేటెంట్ హక్కు కల్పించింది. ఇలాంటి ఇక్కత్ కళ దేశంలో మరెక్కడా లేదు. కాలాగుణంగా చేనేత కార్మికులు ఇక్కత్ డిజైన్లలో అనేక నూతన ఆవిష్కరణలకు జీవం పోశారు. ప్రస్తుతం రాజ్‌కోట్ చీరలకు మంచి డిమాండ్ ఉంది. కాగా ప్రజల అభిరుచులకు అనుగుణంగా పోచంపల్లి ఇక్కత్‌లో గద్వాల, కంచి, ధర్మవరం డిజైన్లు వచ్చేలా వినూత్న ప్రయోగాలు చేస్తూ విజయం సాధిస్తున్నారు.

మారిన మార్కెటింగ్ ట్రెండ్..

పద్మశ్రీ చింతకింది మల్లేశం రూపొందించిన ఆసుయంత్రంతో పాటు కండెలుచుట్టే యంత్రాలు రావడంతో కార్మికులకు శ్రమభారం తగ్గి, వస్త్రోత్పత్తి పెరిగింది. చేనేత వస్త్రాల మార్కెటింగ్ సౌకర్యాలు కూడా విస్తరించాయి. బహుళజాతి కంపెనీలైన అమెజాన్, ఫ్లిప్‌మార్ట్ లాంటి సంస్థలు కూడా ముందుకు వచ్చి చేనేత వస్త్రాలను అంతర్జాతీయ మార్కెట్‌లో ఆన్‌లైన్ మార్కెటింగ్ చేస్తున్నాయి. చదువుకున్న యువకులు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ లాంటి సామాజిక మాధ్యమాల్లో చేనేత వస్త్రాలను ప్రదర్శించి ఆన్‌లైన్ వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 9వేల వరకు జియో ట్యాగింగ్ కల్గిన మగ్గాలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి 15వేల చేనేత కుటుంబాల్లో సుమారు 30వేల మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న 6200 మగ్గాలపై 11,500 చేనేత కార్మికులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో 27 చేనేత సహకార సంఘాలు, 18 గార్మెంట్ సొసైటీలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయి.

కార్మికులు కోరుతున్నవి ఇవే..

- రైతుల నుంచి ధాన్యం మాదిరిగానే చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి.
- రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలు, నగరాలు, పట్టణ కేంద్రాల్లో టెస్కో ద్వారా షోరూమ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు డిస్కౌంట్‌లో చేనేతవస్త్రాలను ఏడాది పొడవునా విక్రయించాలి.
- అధికారులు, ప్రజాప్రతినిధులు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ప్రతి సోమవారం తప్పనిసరిగా చేనేత వస్త్రాలను ధరించేలా చర్యలు తీసుకోవాలి.
- నూలు, చేనేతవస్త్ర అమ్మకాలపై విధించిన జీఎస్టీని ఎత్తివేయాలి.
- చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్స్‌కు బ్యాంకుల ద్వారా జీరో వడ్డీ రుణాలను ఇప్పించాలి.
- చేనేత కార్మికులకు రుణమాఫీ చేయాలి.

ఆధునిక మగ్గాలు అందజేయాలి



40 ఏళ్లుగా మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ప్రస్తుతం గుంతమగ్గం నేస్తుండటంతో నడుం నొప్పి వస్తుంది. కూర్చోడానికి, లేవడానికి ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఆధునిక ఫ్రేమ్ మగ్గాలను ఉచితంగా అందజేయాలి. హెల్త్‌స్కీమ్‌ను పునరుద్ధరించాలి. మగ్గం నిర్వహణకు రుణాలు ఇవ్వాలి.

– ఏర్వ నీలమ్మ, చేనేత కార్మికురాలు, భూదాన్‌పోచంపల్లి

చేనేత రుణాలు మాఫీ చేయాలి



పోచంపల్లిలో సుమారు 4వేల వరకు బ్యాంకుల్లో లక్ష, రెండు లక్షల రుణాలు తీసుకున్నారు. ప్రస్తుతం చేనేత వస్త్రాలకు గిరాకీలేక కార్మికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చేనేత రుణాలు కూడా మాఫీ చేయాలి.

– మెరుగు శశికళ, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు, భూదాన్‌పోచంపల్లి

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ప్రభుత్వం నూలు ఇస్తుంది. కార్మికులు చీరలు తయారు చేస్తున్నారు. ఉత్పత్తి అయిన చీరలను అమ్ముకోవడానికి మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంలేదు. ప్రస్తుతం పోచంపల్లికేంద్రంగా కోట్ల రూపాయల విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. వీటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

– తడక రమేష్, చేనేత టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు, భూదాన్‌పోచంపల్లి